క్లుప్తంగా

కుక్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఏనుగొండ వద్ద ఉన్న అర్బన్ కేజీబీవీలో అసిస్టెంట్ కుక్ పోస్టు, రూరల్ కేజీబీవీలో రెండు కుక్ పోస్టులు ఉన్నాయని, ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఈఓ జయశ్రీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్హతలు కనీసం పదో తరగతి పాస్ అయిన వారు నేరుగా కేజీబీవీలో రెండు రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

జడ్చర్ల: జడ్చర్ల–మహబూబ్‌నగర్ ప్రధాన జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు చర్యలు చేపట్టినట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. శంకరాయపల్లి తండాకు వెళ్లే మలుపు వద్ద ప్రధాన రహదారిపై ఆదివారం వేగ నియంత్రణ కోసం స్టాపర్స్ ఏర్పాటుతో పాటు అక్కడ రాత్రి వేళలో వెలుతురు బాగా ఉండేందుకు వీలుగా లైట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కోడ్గల్‌లో శకటోత్సవం

జడ్చర్ల: మండలంలోని కోడ్గల్‌లో శ్రీరామచంద్రస్వామి జాతర సందర్భంగా సోమవారం శకటోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బండ్లు, ట్రాక్టర్లను స్వామి వారి ఆలయం చుట్టూ తిప్పి భక్తులు తమ మొక్కులను చెల్లించుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, సర్పంచ్ మమత తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులకు ఇఫ్తార్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లా కేంద్రానికి సమీపంలోని జయప్రకాశ్ నారాయణ్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ముస్లిం అధ్యాపకులకు ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కేఎస్ రవికుమార్, ప్రిన్సిపాల్ సుజీవన్‌కుమార్, అధ్యాపకులు బదిరున్నీసా, షానవాజ్, ఎండీ జిలాని, నయీమ్, ముస్తాక్‌అలీ పాల్గొన్నారు.

ఇసుక డీసీఎం పట్టివేత

అడ్డాకుల: మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లి శివారులోని పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మినీ డీసీఎంను పట్టుకున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. అదే గ్రామానికి చెందిన డీసీఎంలో అక్రమంగా వాగులో ఇసుకను నింపుకుని తరలిస్తుండగా, సర్వీస్ రోడ్డు వద్ద సోమవారం పట్టుకుని వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చెక్కు అందజేత



భూత్పూర్: మండలంలోని అన్నాసాగర్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.52వేల విలువ గల చెక్కును సోమవారం అందజేశారు. నియోజకవర్గంలోని మదునాపురం మండలం నెల్విడికి చెందిన బాలకిష్టయ్య కుటుంబ సభ్యులను సీఎం రిలీఫ్ ఫండ్‌ద్వారా మంజూరైన రూ.52వేల విలువ గల చెక్కును ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అందజేశారు.

357మందికి కంటి పరీక్షలు

భూత్పూర్: కంటి వెలుగులో భాగంగా శనివారం మండలంలోని ఎల్కిచర్ల, పోతులమడుగులో గ్రామాల్లో 357 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 20మందికి కంటి అద్దాలు పంపిణీ చేయగా, 79 మందికి కంటి అద్దాలు రావాల్సి ఉందని సీహెచ్ఓ రామయ్య తెలిపారు. 38మందికి కంటి ఆపరేషన్ కోసం రెఫర్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు హిమబిందు, రాధిక, సర్పంచ్‌లు పద్మ, కమలమ్మ, హెల్త్ సూపర్ వైజర్లు యాదమ్మ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన



జడ్చర్ల: గుండెపోటు సమయంలో ప్రాణాన్ని కాపాడేందుకు సీపీఆర్ చేయాలని, ప్రతి ఒక్కరూ అవగాహన ఏర్పరుచుకోవాలని గంగాపూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి శివకాంత్ తెలిపారు. సోమవారం పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల గుండెనొప్పి కారణంగా వయస్సుతో తేడా లేకుండా ప్రాణాలను కోల్పోతున్నారని తెలిపారు. అలాంటి సమయంలో సీపీఆర్ చేసినట్లయితే ప్రాణాన్ని కాపాడే పరిస్థితి ఉంటుందన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

మహబూబ్‌నగర్ రూరల్: గర్భిణుల ఆరోగ్యానికి, పిల్లల ఎదుగుదలకు పోషకాహారం చాలా అవసరమని కోడూర్ పాఠశాల హెచ్ఎం రమేష్‌గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని కోడూర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో గల అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాలపై ప్రతిఒక్కరికీ అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు యశోద, మల్లేశ్వరి పాల్గొన్నారు.

చేనేత, హస్తకళలను ఆదరిద్దాం



చేనేత ఉత్పత్తులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు

● మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన చేనేత, హస్తకళల ప్రదర్శనను పట్టణ ప్రజలు సందర్శించి సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు అన్నారు. జిల్లా కేంద్రం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఎక్స్‌పో ప్లాజాలో స్వదేశి హ్యాండ్ క్రాఫ్ట్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'చేనేత హస్తకళల ప్రదర్శన'ను సోమవారం మున్సిపల్ చైర్మన్ ప్రారంభించారు. పలు చేనేత ఉత్పత్తులను చైర్మన్ పరిశీలించారు. చైర్మన్ మాట్లాడుతూ చేనేత రంగంలోని ఉత్పత్తులు నాణ్యత, మన్నికకు మారుపేరని అన్నారు. పట్టణం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నదని, దీంతో ఇలాంటి హస్తకళ ప్రదర్శనలు అందుబాటులోకి వస్తుండడం సంతోషంగా ఉందన్నారు. స్వదేశి హ్యాండీ క్రాఫ్ట్ సొసైటీ ఆర్గనైజర్ కె.చిరంజీవి మాట్లాడుతూ చేనేత హస్తకళ ప్రదర్శనను ఈనెల 23వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హస్తకళల్లో కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక, కొయ్య బొమ్మలు, రోజ్‌వుడ్, బ్లాక్‌మెటల్, వెండి, ముత్యాల ఆభరణాలు, ఇత్తడి, నారపీచు, సిరామిక్ వస్తువులు, స్ఫటిక, రుద్రాక్ష మాలలు, టెర్రకోట పూలకుండీలు, లెదర్ వస్తువులను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా చేనేత వస్త్రాలతోపాటు పోచంపల్లి, నారాయణపేట, గద్వాల, వెంకటగిరి జరీ చీరలు, మంగళగిరి, గుంటూర్ చీరలు, సిల్క్‌కాటన్ చీరలు, చందేరి పాటూర్ చీరలు, కాటన్ ప్రింటెడ్ చీరలు, చేనేత దుప్పట్లు, కర్టెన్లు, బంజార, గాగ్ర డ్రెసెస్, సోఫా కవర్స్, టవల్స్, నర్సాపురం లేసులతోపాటు ఖాదీ మెటీరియల్‌ను ఉంచినట్లు తెలిపారు. హ్యాండ్‌లూమ్స్‌పై 20 శాతం, హ్యాండీ క్రాఫ్ట్స్‌పై 10 శాతం డిస్కౌంట్ అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు ప్రారంభం



జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో ప్రశ్నపత్రాల పంపిణీని పర్యవేక్షిస్తున్న ఆర్‌జేడీ విజయలక్ష్మి

జడ్చర్ల: పదో తరగతి పరీక్షలు తొలి రోజు సోమవారం ప్రశాంతంగా ముగిసాయి. ఆర్‌జేడీ విజయలక్ష్మి పదో తరగతి పరీక్షలను పరిశీలించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచిన ప్రశ్నపత్రాల పంపిణీని ఆమె పర్యవేక్షించారు. ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. మొత్తం 8పరీక్ష కేంద్రాల్లో 1,711 మంది విద్యార్థులకు గాను 1,701 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎంఈఓ మంజులాదేవి పరీక్ష కేంద్రాలను సందర్శించారు.

మహమ్మదాబాద్: ఉమ్మడి గండేడ్, మహమ్మదాబాద్ మండలాల్లో 1,025 మంది విద్యార్థులకు గాను 1,023 మంది హాజరైనట్లు మండల విద్యాధికారి వెంకటయ్య తెలిపారు.

అడ్డాకుల: అడ్డాకుల, మూసాపేట మండలాల్లో పదో తరగతి పరీక్ష సజావుగా సాగింది. అడ్డాకుల జెడ్పీ హైస్కూల్‌లో 250 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. మూసాపేటలో 156 మంది విద్యార్థులకు గాను 154 మంది పరీక్ష రాయగా ఇద్దరు గైర్హాజరయ్యారు. జానంపేట హైస్కూల్‌లో 216 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. మూసాపేటలో తహసీల్దార్ మంజుల, జానంపేటలో ఎంపీడీఓ స్వరూప పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

భూత్పూర్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, న్యూ ఎర ఉన్నత పాఠశాలలో పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులంతా హాజరైనట్లు ఎంఈఓ నాగయ్య తెలిపారు.

నవాబుపేట: మండలంలోని నాలుగు కేంద్రాల్లో చేపట్టిన పరీక్షలను మండల విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించారు.

రాజాపూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొత్తం 228 మంది విద్యార్థులు మొదటిరోజు పరీక్ష రాసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ పాండురంగారెడ్డి తెలిపారు.

మిడ్జిల్: మండలంలో 277 మంది విద్యార్థులకు గాను 275 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

చిన్నచింతకుంట: మండల కేంద్రంలోని పరీక్ష కేంద్రంలో 281 మంది, పెద్దవడ్డేమాన్‌లో 226 మంది పరీక్షలకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ సువర్ణరాజు, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షించారు.

బాలానగర్: మండలంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో 676 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ వెంకటయ్య తెలిపారు.

దోషులను శిక్షించాలి



మహబూబ్‌నగర్ రూరల్: కోయిలకొండ మండలం వింజమూర్‌లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నిప్పుపెట్టిన దోషులను గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహయ్య డిమాండ్ చేశారు. సోమవారం అదనపు కలెక్టర్ సీతారామారావును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వింజమూర్‌లో ప్రారంభోత్సవానికి సిద్ధం చేసిన అంబేడ్కర్ విగ్రహానికి నిప్పుపెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఎక్కడ చూసినా అంబేద్కర్ విగ్రహాల మీద దాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి అంబేద్కర్ విగ్రహం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు, నాయకులు రాఘవేందర్, వెంకటేష్, మహేష్, మాసయ్య, శివకుమార్ పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం



మాట్లాడుతున్న జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి

రాజాపూర్: రైతుల సమస్యలు పట్టని టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దెదింపే వరకు ఉద్యమిస్తామని టీపీసీసీ సెక్రటరీ జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రంగారెడ్డిగూడలో హాత్‌సేహాత్ జోడో యాత్రలో భాగంగా ఇంటింటికీ తిరిగి టీఆర్ఎస్ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేస్తామన్న ప్రభుత్వం ఇప్పటి వరకు పట్టించుకోకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. రైతులపాలిట ధరణి పోర్టల్ శాపంగా మారిందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణయ్య, రమేష్‌రెడ్డి, అనిల్, సాయి పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వం

మహబూబ్‌నగర్ రూరల్: ప్రజలను బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అంజయ్య ఆరోపించారు. బూత్ స్వశక్తికరణ అభియాన్‌లో భాగంగా సోమవారం మండలంలోని కోడూర్‌లో శక్తి కేంద్ర ఇన్‌చార్జీలు, బూత్ అధ్యక్షులతో మండల అధ్యక్షుడు రాజుగౌడ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయిస్తామని క్రిష్టియన్‌పల్లి శివారులోని ఆదర్శనగర్‌లో ఇళ్ల స్థలాలను స్వాధీనం చేసుకున్న ప్రభుత్వం వారికి ఇళ్లు ఇవ్వకుండా మోసం చేసిందని ఆరోపించారు. విలువైన స్థలాలను కోల్పోయిన లబ్ధిదారులకు అండగా నిలిచి బీజేపీ పోరాడుతుందని అన్నారు. సమావేశంలో నాయకులు తిరుపతిరెడ్డి, నాగరాజు, మహేష్‌గౌడ్, శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడదాం

అడ్డాకుల: ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ అన్నారు. మూసాపేట మండలం అచ్చాయపల్లిలో సోమవారం హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యేపై ప్రజల్లో వ్యతిరేక ఏర్పడిందని విమర్శించారు. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా నల్లమట్టి, ఇసుక అక్రమ రవాణాపైనే దృష్టి పెట్టారని ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీ పాలనలో నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశానికి అంటుతున్నాయని వాపోయారు. వచ్చే ఎన్నికల్లో అసమర్థ ప్రభుత్వాల పాలనకు ప్రజలు చరమగీతం పాడతాయని తెలిపారు. అంతకుముందు ఇంటింటికీ తిరుగుతూ బీఆర్ఎస్ పాలనలో జరుగుతున్న అవినీతిపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీసీ శ్రీనివాస్, నరోత్తంరెడ్డి, బోయ నగేష్, నాగన్న, శేఖర్, ఖాదర్, రాములు, మన్నెంకొండ, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ మిషన్ అమలు చేయండి



కోయిల్‌కొండ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం స్వచ్ఛ భారత్ మిషన్ ఫేజ్–2పై మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వీఓఏస్‌లకు డీఆర్‌డీఏ కోఆర్డినేటర్లు రవికుమార్, పవన్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పారిశుద్ధ్య నివారణపై, మరుగుదొడ్ల వినియోగం, నిర్మాణాలు, ప్లాస్టిక్ నివారణపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శశికళ, ఎంపీడీఓ జయరాములు, ఏపీఓ నర్సయ్య పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవించాలి

అడ్డాకుల: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా ప్రజలందరూ చట్టానికి లోబడే ఉండాలని భూత్పూర్ సీఐ రజితారెడ్డి సూచించారు. మండలంలోని శాఖాపూర్, మూసాపేట మండలం జానంపేటలో సోమవారం రాత్రి కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు, నేరస్తులెవరైనా షెల్టర్ తీసుకుంటే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. మహిళలు, చిన్నపిల్లల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, మానసిక, శారీరకంగా హింసించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. ప్రజల శాంతికి ఎవరైనా భంగం కలిగిస్తే పోలీసులకు లేదా 100కు డయల్ చేయాలని తెలిపారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించుకోవాలని గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో ఎస్ఐలు విజయకుమార్, నరేష్, సర్పంచ్‌లు జయన్నగౌడ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విచారణ చేపట్టాలి

చిన్నచింతకుంట: టీఎస్‌పీఎస్ పేపర్ లీకేజీ ఉదాంతంపై ప్రభుత్వం విచారణ చేపట్టాలని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి అరవింద్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక పాలన కొనసాగిస్తుందన్నారు. దీంతో రాష్ట్రంలోని విద్యార్థులకు, నిరుద్యోగులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. పేపర్ లీకేజీ కారణంగా నిరుద్యోగుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు రాము, నాయకులు శివ, మహేందర్‌యాదవ్, రాజు, నాయుడు, శ్రీకాంత్, రాజు పాల్గొన్నారు.



బాధ్యతగా పనిచేస్తేనే అభివృద్ధి



నివేదిక చదివి వినిపిస్తున్న ఏఈఓ శ్రీనివాసులు

అడ్డాకుల: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ బాధ్యతతో పని చేస్తే మరింత అభివృద్ధి చెందుతాయని జెడ్పీటీసీ సభ్యుడు జి.ఇంద్రయ్యసాగర్ అన్నారు. మూసాపేట మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం ఎంపీపీ కళావతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ, జెడ్పీటీసీతో పాటు ఎంపీడీఓ సరోజ, రైతుబంధు మండల అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్ హాజరయ్యారు. గత సమావేశంలో సభ్యులు లేవనెత్తిన అంశాలపై అధికారులు వివరణ ఇస్తూ తమ శాఖల ప్రగతి నివేదికలను వివరించారు. అచ్చాయపల్లి గ్రామస్తులు రేషన్ సరుకుల కోసం జానంపేటకు వెళ్లాల్సి వస్తున్నందునా తమ ఊర్లోనే సరుకులు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ చంద్రశేఖర్ మరోసారి కోరారు. నిజాలాపూర్ నుంచి మహ్మదుస్సేన్‌పల్లి వరకు ఉన్న రోడ్డు పూర్తి గుంతలమయంగా మారినందునా తమ గ్రామానికి బీటీరోడ్డు వేయించే విధంగా కృషి చేయాలని మహ్మదుస్సేన్‌పల్లి సర్పంచ్ నిర్మల విజ్ఞప్తి చేశారు. బీటీరోడ్డుకు నిధులు రాకుంటే మరోసారి సభకు రానని స్పష్టం చేశారు. కాగా, ట్రాన్స్‌ఫార్మర్లు, కొత్త విద్యుత్ లైన్ల కోసం డీడీలు కడితే నెల రోజుల్లో మంజూరయ్యే అవకాశం ఉందని జెడ్పీటీసీ సభ్యుడు ఇంద్రయ్యసాగర్ సభ్యులకు వివరించారు. మండల సభలో సభ్యులు లేవనెత్తే ప్రశ్నలకు అధికారులు సమాధానాలు ఇస్తూ వచ్చే సభ నాటికి వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

మొక్కుబడిగా హాజరు..

మండల సభకు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు మొక్కుబడిగా హాజరయ్యారు. 8మంది ఎంపీటీసీ సభ్యుల్లో నలుగురు ఎంపీటీసీలు, మండల కోఆప్షన్ సభకు వచ్చారు. అదేవిధంగా 15మంది సర్పంచ్‌లకు గాను కేవలం నలుగురు మాత్రమే సభకు రావడం చర్చనీయాంశంగా మారింది. ఎంపీటీసీలు, సర్పంచుల్లో ఎక్కువ మంది ఎందుకు రాలేకపోయారన్నది తెలియరాలేదు. అధికారుల్లో కూడా కొందరు మాత్రమే రావడంతో సభ మొక్కుబడిగా సాగింది. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ వరప్రసాద్, మండల పశువైద్యాధికారి మధుసూదన్, ఏఈఓలు లక్ష్మణ్‌గౌడ్, శ్రీనివాసులు, సర్పంచ్‌లు సాయిరెడ్డి, చంద్రశేఖర్, నిర్మల, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

కులమతాలతోనే రాజకీయం

మంత్రి శ్రీనివాస్‌గౌడ్



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హన్వాడ: ఎన్నికలు వచ్చాయంటే బీజేపీకి కులం, మతం గుర్తుకు వస్తుందని, కుల మతాల పేరిట ప్రజల మధ్య చిచ్చుపెట్టి ఎన్నికల్లో లబ్ధిపొందే ప్రయత్నం చేస్తారని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. తెలంగాణకు బీజేపీ మొదటి నుంచి అన్యాయం చేస్తోందని ఆయన ఆరోపించారు. సోమవారం మండలంలోని దాచక్‌పల్లి గేట్ వద్ద బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎన్నికలకు ముందు జిల్లా కేంద్రంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ఇస్తానని మాటతప్పారని, తెలంగాణ ప్రాంతంపై బీజేపీ నాయకత్వానికి ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. తెలంగాణపై ఉన్న అక్కసుతోనే ఎమ్మెల్సీ కవితపై అక్రమ కేసులు పెట్టారని, తెలంగాణకు నిధుల విషయంలో బీజేపీ వివక్షను ప్రదర్శిస్తోందని తెలిపారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకు పెద్ద ఎత్తున నిధులు ఇస్తూ రాష్ట్రాలకు తీవ్రమైన అన్యాయం చేస్తోందన్నారు. అదేవిధంగా ఇటీవల విడుదలైన 'బలగం' సినిమాను అందరూ చూడాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ఎంపీపీ బాల్‌రాజు, జెడ్పీటీసీ విజయనిర్మల, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, జిల్లా గొర్రెల పెంపకందారుల సంఘం అధ్యక్షుడు శాంతన్న, వైస్ ఎంపీపీ లక్ష్మి, నాయకులు రాజుయాదవ్, అన్వర్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యత..

స్టేషన్ మహబూబ్‌నగర్: మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం వక్ఫ్ కాంప్లెక్స్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడిగా మహమూద్‌అలీ, ఉపాధ్యక్షులుగా సయ్యద్ మోసిన్, ఖాజాపాష, కార్యదర్శిగా మక్సూద్ బిన్ అహ్మద్ జాకీర్, కోశాధికారిగా ముజీబ్ అన్సారీతో పాటు 8మంది సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ రహమాన్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మరు

ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

రాజాపూర్: రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి, ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని, కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని జడ్చర్ల ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ముదిరెడ్డిపల్లిలో నవాబ్‌పేట్ మండల ప్రజాప్రతినిధుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణలో అభివృద్ధి పథకాలను చూసి కర్ణాటక, మహారాష్ట్ర ప్రభుత్వాలు తమ రాష్ట్రంలో కూడా అమలు చేస్తామంటున్నారని అన్నారు. పని చేసే నాయకులను ఎన్నుకోవాలన్నారు. రాష్ట్రంలో రైతులు, విద్యా, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. గురుకుల పాఠశాలలు, మాడల్ పాఠశాలలను ఏర్పాటు చేసి విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేసినట్లు గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలనను ప్రజలు ఛీకొట్టారని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కేవలం మతాలు, కులాల మధ్య చిచ్చుపెడుతూ ప్రజల జీవితాలతో చెలగాటమాడుతుందని విమర్శించారు. బీజేపీకి ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, డీసీఎంఎస్ ప్రభాకర్‌రెడ్డి,పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు శ్వేతారెడ్డి, ఖాజామైనొద్దీన్, సర్పంచ్ గోపాల్‌గౌడ్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు

ఎన్నికల ప్రచార రథం సిద్ధం..

జడ్చర్ల: అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతుండడంతో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఎన్నికల ప్రచార రథాన్ని సిద్ధం చేసుకున్నారు. సోమవారం ముదిరెడ్డిపల్లి వద్ద జరుగుతున్న ఆత్మీయ సమ్మేళనం సభాస్థలి వద్దకు ప్రచార రథాన్ని తీసుకువచ్చారు.

దొడ్డి కొమురయ్యకు ఘన నివాళి



కొమురయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం అలుపెరుగని పోరాటాలు చేసిన దొడ్డి కొమురయ్య సేవలు మరువలేనివని సీపీఎం నాయకుడు కిల్లెగోపాల్ అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక రైల్వేస్టేషన్‌లో దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో 4వేల మంది కమ్యూనిస్టులు అసువులుబాశారని, అందులో దొడ్డికొమురయ్య ఉన్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చంద్రకాంత్, నాయకులు సత్యయ్య, నారాయణగౌడ్, రాజకుమార్, మోహన్, మొగిలి పాల్గొన్నారు.

బాలానగర్: యాదవ ముద్దుబిడ్డ దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు మండల కేంద్రంలో సోమవారం యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంఘం మండల ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్ దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు నర్సింహులు, మల్లేష్ యాదవ్, రాజేష్, చెన్నయ్య, గోవర్దన్, రాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్



జిల్లా బీజేపీ కార్యాలయానికి ర్యాలీగా వెళ్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా బీజేపీ కార్యాలయాన్ని ముట్టడించారు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తా నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు ర్యాలీగా బీజేపీ కార్యాలయానికి చేరుకుని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కార్తీక్, ఎంఎస్‌పీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ జంగయ్య, మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జ్ కృష్ణయ్యలు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తే వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేస్తామని మాట ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చి ఎనిమిదేళ్లు అవుతున్నా ఎస్సీ వర్గీకరణపై నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని అన్నారు. తక్షణమే ఎస్సీ వర్గీకరణపై స్పష్టమైన వైఖరి తెలియజేయాలని, లేదంటే బీజేపీ నాయకులను గ్రామాల్లో తిరగనిచ్చేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ రాజు, నాయకులు సురేష్, యాదయ్య, శ్రీరాములు, కాన్షీరాం, కేశవులు, వెంకటస్వామి, లచ్చీ, విష్ణు, శివ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇథనాల్ కంపెనీని ఎత్తివేయాలి

చిన్నచింతకుంట: చిత్తనూర్ ఇథనాల్ కంపెనీని వెంటనే ఎత్తి వేయాలని కేఎస్‌పీఎస్ ఆల్ ఇండియా కన్వీనర్ బండారి లక్ష్మయ్య డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరికల్ మండలం చిత్తనూర్ గ్రామ శివారులో ఇథనాల్ కంపెనీ ఏర్పాటు చేస్తున్నారని, వ్యతిరేకిస్తూ ఈనెల 6వ ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ధర్నా నిర్వహిస్తున్నామన్నారు.

నీటి పొదుపు ముఖ్యం

గండేడ్: గ్రామాల్లో నీటి వృథాను అరికట్టాలని వెన్నాచేడ్ సర్పంచ్ గంగుల పుల్లారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని వెన్నాచేడ్‌లో తాగునీటి కోసం 2,3,4 వార్డుల్లో నూతనంగా రెండు బోర్లు వేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఖలీం, వార్డు మెంబర్లు రవీందర్‌గౌడ్, పెంటయ్య, వెంకటమ్మ, ఎల్లమ్మ, కో అప్షన్ సభ్యురాలు మల్లిక, పులిందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.